# అలవాటు

గోపీని అమాంతంగా ఆరేళ్ళ తర్వాత చూడగానే నా ఆనందానికి అంతులేదు!

ఆరేళ్ళ క్రితం కాలేజీనుంచి బయటపడగానే చెరొహాదారి తొక్కాం. వంశపరంపరగా వస్తోన్న "బానిసవృత్తి"ని నేనవలంబించాను. ఆర్థిక దుస్థితిలో నాకంటే ఏమాత్రం తీసిపోని గోపీమాత్రం స్వార్థానికి లొంగిపోక, దేశం క్షేమంకొరకూ, ప్రజాస్వామ్యంకొరకూ పాటుపడడానికై రాజకీయరంగంలోకి దూకాడు. అందుకే అతనంటే నాకు అపారమైన భక్తి గౌరవాలు!

ఈ ఆరేళ్ళూ అప్పుడప్పుడు పత్రికల్లో అతని పేరు చూడటం తప్ప కలుసుకునే భాగ్యం లభించలేదు.

"గోపీ! నువ్విల్లా! ఇంతదూరం నాకోసం వస్తావని కలలో కూడా అనుకోలేదు సుమా...!"

"అందుకే ఇలలో వచ్చాను."

"అంటే ఇన్నాళ్ళకుగాని నీకు నామీద దయ కలగలేదన్న మాట."

"నీమీద దయ కలిగికాదు, నామీదే నాకు దయకలిగి వచ్చాను."

"అంటే?"

"నన్ను చూడు! ఎలా తయారయాను? కొన్నాళ్ళపాటైనా పూర్తి విశ్రాంతి తీసుకోకపోతే లాభంలేదని చెప్పేశారు డాక్టర్లు. పట్నానికీ, రాజకీయాలకీ ఎంత దూరంలోవుంటే అంత మంచిదన్నారు. నిన్ను వెతుక్కుంటూ వచ్చాను."

"చాలా మంచిపనిచేశావు. నీకిక్కడ తప్పకుండా ఆరోగ్యం కుదురుతుంది. అంతవరకూ నిన్నిక్కడినుంచి కదల్నివ్వను."

"చూద్దాంలే."

అతిథిగదిలో గోపీకి బస ఏర్పాటు చేయించాను.

"గోపీ! నువ్వు గాంధీవాదివి. నీకే అభ్యంతరం వుండదనుకుంటాను."

"దేనికి?"

"ప్రస్తుతం నాకు వంటచేసేది షేక్ అబ్దుల్లా..."

"ఓహో! ఫరవాలేదులే; శుభ్రంగావుంటే చాలు."

స్నానాదులు ముగించుకునేసరికి వంట సిద్ధమైంది. భోజనానికి కూచున్నాం.

"ఏం గోపీ! ఎలావున్నాయి వంటకాలు?"

"బాగానే వున్నాయి... ఈ కాశ్మీరు మాజీ ప్రధానికి ఎంత జీతమిస్తున్నావేం?"

"నేను ఇవ్వటమేమిటీ, సర్కారే ఇస్తుంది."

"సర్కారా?... నీ వంటమనిషికి?..."

నోట్లో ముద్ద పెట్టుకుంటూన్న వాడల్లా ఆపి చూస్తూన్నాడు గోపి.

"ఏఁ ఇందులో ఆశ్చర్యమేముంది! నేను ఆఫీసరునని తెలీదు నీకూ? నాకు ముగ్గురు ప్యూనుల్ని ఇస్తారు, మా ఆఫీసరుకి ఆరుగురు, ఆపై ఆఫీసరుకి ఏడుగురు."

"ఒక్కొక్క మనిషికి ఇంతమంది సేవకులా?"

"అబ్బాయి, ఆదర్శాలు మాట్లాడకు. మనుషులనుబట్టికాదు, మనుషుల హోదానుబట్టి వుంటుంది. మా కనీసపు అవసరాలను తీర్చేందుకు వీళ్లు ఎంతైనా అవసరం. నాసంగతే చూడు___ నాకు ఒక వంటమనిషి కావాలా?"

"నీ భార్యో?"

"ప్రస్తుతం ఇక్కడలేదనుకో. వున్నా వేరే వంటమనిషి వుండక తప్పదు. ప్యూనుకు జీతం నలభై ఎనిమిది, ఈ వంటవాడికి నేను ఇరవై అయిదు ఇచ్చి, తక్కిన ఇరవైకి బదులు తిండి పెడుతూన్నాను. మరొ హాడు బజారుపన్లకి వున్నాడు. వాడికి పూర్తి జీతం ఇచ్చేస్తాను. మూడో వాడి బదులు, ముప్పై రూపాయలకు ఒక ఆడమనిషిని అంట్లు తోమటానికీ, గుడ్డలు పిండేయటానికీ, వాకిలి చిమ్మటానికి పెట్టుకున్నాను. తక్కిన పద్దెనిమిది రూపాయలకు ఒక కుర్రవాడు నారెండు గేదెల్ని మేపుకొచ్చి పొద్దునా సాయంత్రం పాలుపితుకుతాడు. ఇందులో ఏది అనవసరమో నాకు తోచడంలేదు."

"గేదెల్ని మేపుకురావడంతప్ప తక్కినపన్లన్నీ తలచుకుంటే నువ్వూ, నీ భార్యా చేసుకోగలరు."

"అలాచేసే ఆఫీసర్లు లేకపోలేదు. కాని వాళ్లుకాస్తా ఆ నౌకర్ల జీతా లని తామే కాజేస్తారు... నేనింకా నయంకాదూ? నావల్ల నలుగురు బతికి పోతున్నారు..."

క్షణంసేపు నాకేసి నిదానంగాచూసి తలదించేశాడు గోపి.

భోజనం తర్వాత గోపి పడుకున్నాడు. నేను పనిమీదికి వెళ్ళిపో యాను. సాయంత్రం కార్యాదులు అయినాక గోపీనికూడా పనిదగ్గరికి తీసి కెళ్ళాను. అక్కడ మా ఆఫీసరున్నాడు. ఖద్దరు ముతకబట్టల్లో 'జంగ్లీ' గా కనిపిస్తూన్న గోపీనిచూసి అతను మనసులో ఏమనుకుంటాడో అనుకొని ఇంగ్లీషులోనే పరిచయం చేశాను. ఆతర్వాత నాపనిలో మునిగి చాలా సేపటివరకు గోపీ విషయమే మరచిపోయాను.

రాత్రి భోజనాల దగ్గిర అడిగాడు గోపీ. "మొన్న ఎవరో చనిపో యారటగా?" అని.

"ఎవరూ?... ఎప్పుడూ?"

"బ్లాస్టింగ్ చేస్తూ ఒక కూలి..."

"ఓ అదా?... దానికేంలే అది మామూలే."

"ఎవరు బాధ్యులంటావ్?"

"వాడూ, వాడిఖర్మ! ఎవరేం చేస్తారు?"

"మరి వాడి భార్యాపిల్లలో?"

"నష్ట పరిహారం ఇస్తాంగా?"

"ఎప్పుడూ?"

"కేసు పైకిపోయింది."

గోపీ మాట్లాడలేదు.

భోజనాల తర్వాత చాలా సేపటి వరకు గోపి రాజకీయానుభవాల గురించీ, ప్రస్తుతపు రాజకీయాలను గురించీ, ప్రపంచ పరిస్థితులను గురించీ మాట్లాడుకున్నాము.

రెండోరోజు ప్రొద్దున్నే మెలకువ రాలేదు. నౌకరు వచ్చి లేపాడు. మా ఆఫీసరు అర్జంటుగా ఫోనుమీద పిలుస్తున్నాడని. పరుగెత్తుకెళ్ళాను. ఆఫీసరు చెప్పాడు. మా సెక్షనులో పనివాళ్లు సమ్మె చేస్తున్నారట... షాక్ తగిలింది! నా సెక్షన్‌లో ఇంతవరకు అల్లాంటిదేమీ కాలేదు. వెళ్ళి చూస్తానంటూ త్వరత్వరగా గుడ్డలేసుకుని మోటారు సైకిలుమీద దౌడు తీశాను,

నిజమే, పనివాళ్ళంతా పనిమీది కెక్కకుండా కూర్చుని వున్నారు. ముకద్దములను పిలిచి ఆడిగాను. మొన్న చనిపోయిన కూలివాడి భార్యా పిల్లలకిచ్చే నష్ట పరిహార ధనం వెంటనే ఇస్తేగాని పనికెక్కరట. నాకు వళ్లు భగ్గుమంది. ఇన్నాళ్లూ లేంది ఈ రోజు....? వాళ్ళని బాగా చీవాట్లు పెట్టాను. తప్పంతా పనివాళ్ళపైకి తోసేసి తప్పుకున్నారు వాళ్ళు.

పై ఆఫీసరు ఫోను వచ్చింది. సంగతి తెలియజేశాను, కాని మరేం ఫరవాలేదు, వాళ్ళ రోగం నేను కుదురుస్తాను లెమ్మని హామీ ఇచ్చాను.

ఆ కూలీవాడి భార్యాపిల్లలు మూడు రోజుల నుంచి పస్తులుంటున్నారంటూ కొందరు కూలీలు నా దగ్గరికొచ్చారు. వాళ్ళంతా పనిమీది కెక్కితేనేగాని వాళ్ళతో అసలు మాట్లాడనని తిరగ్గొట్టేశాను. కాని ససేమిరా వాళ్లు కదల్లేదు.

గంట గడిచింది. ఇంటికి ఫోను చేశాను. నేనిప్పుడప్పుడే ఇంటికి రాను, గోపీని ఫలహారం చేసివెయ్యమని.

వెంటనే పనివాళ్ళంతా పనిమీది కెక్కకపోతే, వాళ్ళను తిరిగి పనిలోనికి రానివ్వననీ, వేరేవాళ్ళను తెస్తాననీ బెదిరించాను. కాని లాభం లేకపోయింది.

పొద్దెక్కుతోంది. ఆఫీసరు దగ్గర్నించి ఫోను కాల్సు వస్తోనే వున్నాయి. ఆయనకి హామీ యిస్తూనే ఉన్నాను. కాని మనసులో మాత్రం ధైర్యం క్షీణిస్తోంది.

ఇంతలోకి గోపి కనిపించాడక్కడ. నా కాశ్చర్యం వేసింది.

"ఏం గోపీ! ఇలా వచ్చావేం ఎండలో? ఫలహారం చేశావా?"

"ఆ, చేశాను... కాని సూరీ! ఎందుకీ మొండి పట్టు!"

"అం?..." చకితుణ్ణయాను! గోపీ పెట్టిన చిచ్చు కాదుకదా?

"గోపీ! నువ్వు......"

"సూరీ! నన్నపార్థం చేసుకోకు. పట్నంనించి ఇంత దూరం వచ్చింది ఇందుక్కాదు, కాని నిన్న సాయంత్రం నేనిక్కడ వంటరిగా నిలుచున్నప్పుడు వీళ్ళ గోడు వినలేకపొయ్యాను. వాళ్ళ హక్కుల్ని వాళ్ల సంపాదించుకోటానికి వాళ్ళ చేతుల్లో వున్న సాధనం ఒక్కటే—సమ్మె. అదే వాళ్ళకు బోధ పరిచాను, అంతే..."

నా నోట మాట రాలేదు. అరనిమిషం తర్వాతగాని తేరుకోలేదు. దగ్గరున్న వాళ్ళనందర్నీ పంపించివేశాను.

"అయితే నువ్విప్పుడు వాళ్ళ తరఫున వాదించటానికి వచ్చావా?"

"వాదించటానిక్కాదు. పరిష్కారం చెయ్యటంలో నీకు సహాయం చేద్దామని."

"సరే నువ్వేటన్నా అనుకో. కాని నేను మాత్రం వాళ్ళంతా పనిలో చేరక పూర్వం అసలీ విషయమే మాట్లాడను."

"ఎందుకా False Prestige సూరీ! నిజమేమిటో గ్రహించి పరిష్కారం చెయ్యాలి గాని."

"ఏవిఁటా నిజం?"

"ఆ కూలివాడు చావడం నిజమే కదా! వాడి భార్యా పిల్లలు పస్తుంటున్నారనీ..."

"ఆ కేసు నేనప్పుడే పైకి పంపించానని చెప్పాగా..."

"అంతటితో అయిపోయిందా? ఆర్నెల్లు పట్టొచ్చు."

"పట్టొచ్చు. దానికి మేమేం చేస్తాం? మా జేబులోంచి ఇవ్వమంటావా?"

"ఇంత పెద్ద పని చేయిస్తోన్న మీ పెద్ద ఆఫీసరు కూడా ఇక్కడే వుంటాడే, అతను అడ్వాన్సుగా ఇవ్వలేడూ?"

"ఇవ్వలేడు– సర్కారువారి మంజూరు లేంది."

"సర్కారువారిని ఒప్పించి అధికారం తీసుకోవాలి."

"అది ముందు సంగతి. ప్రస్తుతం మాత్రం ఆ అధికారం లేదు."

"ప్రయత్నిస్తే ఇదే ఉదాహరణ కావచ్చు. ముందు నీ ఆఫీసర్ని కనుక్కో."

"అడగను. వాళ్ళంతా పనిలో చేరితేగాని షరతులు మాట్లాడనని ఆఫీసరుకు మాట ఇచ్చాను."

"మళ్ళీ అదే Prestige."

నేను ఆలోచనలో పడ్డాను – తెగిందాకా తెంపకూడదని సలహా ఇస్తోంది నాలో ఏమాత్రమో మిగిలివున్న కాలేజీ పరిజ్ఞానం. ఒక నిశ్చయానికి వచ్చాను.

"సరే, గోపీ! నేను నీ షరత్తు కొప్పుకుంటాను. మా ఆఫీసరు నొప్పించి పరిహార ధనం ఇప్పించేస్తాను ఇవ్వాళ్ళే. నా హామీ. కాని నువ్వు నాకు సహాయం చెయ్యాలి. వాళ్ళంతా ఇప్పుడే పనుల్లో కెక్కేట్టు చెయ్యాలి."

చిరునవ్వు నవ్వాడు గోపీ.

"సరే ప్రయత్నిస్తాను" అంటూ వెళ్ళాడు.

కొద్ది సేపట్లో పనివాళ్ళంతా తమ పనుల్లోకి వెళ్తున్నారు.

ఆఫీసర్‌కు ఫోన్ చేసి చెప్పాను. అయిదు నిమిషాలు పట్టింది అతణ్ణి ఒప్పించటానికి.

గోపీ చెవిని వేశాను ఆ వార్త. సంతోషించాడు. నన్ను శ్లాఘించాడు కూడాను. టైం చూశాను. పన్నెండైంది. వెంటనే రైల్వే స్టేషనుకు ఫోను చేశాను. మధ్యాహ్నం బండిలో పట్నానికి ఒక సెకండ్ క్లాసు బర్తు రిజర్వు చేయించాను.

"నువ్వు పట్నం వెళ్తున్నావా సూరీ?" ఆశ్చర్యంతో అడిగాడు గోపీ.

"నేను కాదు నువ్వు."

"నేనా?...?"

"అవును. నీకు ఆరోగ్యం కుదిరే చోటు ఇది కాదు గోపీ!" ***